సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



కార్గోతో కాసులు

టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో కార్గో కాసుల పంట పండిస్తోంది. వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. 8లో



గిరిజనుల సమస్యలు..

గిరిజన దర్బార్‌లో ఇచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అధికారులకు సూచించారు. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

78,227 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఒకటి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 78,227 మంది విద్యార్థులకు గత సంవత్సరంలో రెండు విడతలుగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ తెలిపారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలోని కంటి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కొత్తగూడెంతో పాటు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రోజూ కొత్తగూడెంలో 150 మంది విద్యార్థులకు, భద్రాచలంలో 100 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్యులు రాధామోహన్, మధువరణ్, బాలాజీ, సీహెచ్‌ఓ నాగభూషణ్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఆరుగురు జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు జీఎంలను బదిలీ చేస్తూ సోమవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు, కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో జీఎంగా పనిచేస్తున్న ఎం.విజయ్‌భాస్కర్ రెడ్డిని బెల్లంపల్లి ఏరియాకు, కార్పొరేట్ ఆర్ అండ్ డీ విభాగం జీఎం మేకల కనకయ్యను కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేసింది. మరో ముగ్గురు అడిషనల్ జీఎంలను ఉద్యోగోన్నతిపై జీఎంలుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్జీ–3 ఏరియాలో అడిషనల్ జీఎం కొలిపాక నాగేశ్వరరావును అడ్రియాల ప్రాజెక్ట్ జీఎంగా, మందమర్రి ఏరియా కేకే గ్రూప్ ఆఫ్ మైన్స్‌లో అడిషనల్ జీఎం వి.రామదాసును కార్పొరేట్ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగం జీఎంగా, ఆర్జీ–2 ఏరియాలో అడిషనల్ జీఎం మధుసూదన్‌ను కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ జీఎంగా బదిలీ చేసింది. తక్షణమే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆపార్ నమోదు వేగవంతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్లు

ఇల్లెందురూరల్: ఆపార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులు, నాగరాజశేఖర్ సూచించారు. మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆపార్ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలవారీగా నమోదు వివరాలు తెలుసుకున్నారు. ప్రక్రియ వేగవంతం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురి సందేహాలను నివృత్తి చేశారు. ఆపార్ నమోదు ప్రాధాన్యతను గుర్తించి ఈ నెలలోనే నూరు శాతం నమోదు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ స్వామి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాలో దొంగతనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పల్లె, పట్నం, ఇళ్లు, షాపు అని తేడా లేకుండా దుండగులు రెచ్చిపోతున్నారు. నేరప్రవృత్తి జీవన విధానంగా ఉన్న ముఠాలు ఈ పనికి పాల్పడుతున్నాయా ? ఉద్దేశ పూర్వకంగానే ఎవరైనా ఇదంతా చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఒకేసారి అనేక చోట్ల..

ఓవైపు ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగ్స్ పనిగా ఖాకీల విచారణ కొనసాగుతుండగానే పాల్వంచ పట్టణంలో సెల్‌ఫోన్లు, బంగారు చైన్లను దోచుకెళ్లే చిల్లర దొంగతనాలు మొదలవడంతో సమస్య జటిలంగా మారింది. నిన్నా మొన్నటి వరకు టౌన్లలో రెచ్చిపోయిన దొంగలు ఆదివారం రాత్రి ఏజెన్సీ మండలాలపై ప్రతాపం చూపించారు. ములకలపల్లి మండలం జగన్నాథపురంలో ఓ వ్యక్తి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో జ్యూయలరీ షాపులు లక్ష్యంగా దోపిడీ యత్నాలు జరిగాయి. తాళాలు పగులగొట్టి షాపుల్లోకి వెళ్లేందుకు దొంగలు యత్నించారు. క్లూస్ టీమ్స్ రంగంలోకి దిగి ఇక్కడ ఆధారాలు సేకరిస్తున్నాయి.

బాబోయ్ దొంగలు!

- పటిష్ట నిఘా ఏర్పాటు చేసినా ఆగని దొంగతనాలు
- పట్నం, పల్లె తేడా లేకుండా చోరుల హల్‌చల్
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస చోరీలు
- అంతర్రాష్ట్ర సరిహద్దుగా ఉన్న జిల్లా

నిఘా ఉన్నా..

ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు పంచుకుంటోంది. సమీపంలోని ఒడిశా నుంచి కూడా జిల్లాకు రాకపోకలు ఎక్కువే. దీంతో అంతర్రాష్ట్ర సరిహద్దుగా భద్రాద్రి జిల్లా కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా సాగే గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ విభాగం నిరంతరాయంగా పని చేస్తోంది. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలతోపాటు భద్రాచలంలో ప్రత్యేక చెక్ పోస్టును 24 గంటలూ నిర్వహిస్తోంది. మరోవైపు ఆపరేషన్ కగార్ కారణంగా బస్తర్ నుంచి జిల్లా మీదుగా మైదాన ప్రాంతాలకు వచ్చే అనుమానిత వ్యక్తులపైనా నజర్ పెట్టింది. ఇంత జరుగుతున్నా ఖాకీల కన్నుగప్పి దొంగలు తమ చేతి వాటం చూపించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా భావిస్తున్న పోలీసులు!

దోపిడీ దొంగలు ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లాలో రెచ్చిపోవడం మొదలు పెట్టారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ కేంద్రంగా పంజా విసిరారు. ఫిబ్రవరి 7న నవభారత్ క్యాంపస్‌లో చొరబడి ఎనిమిది క్వార్టర్లలో రూ. కోటి వరకు సొత్తు లూటీ చేశారు. ఆ తర్వాత 9, 10వ తేదీల్లో కాంట్రాక్టర్స్ కాలనీలో చోరీలకు పాల్పడ్డారు. 13న రాహుల్‌గాంధీ నగరంలో చోరీకి యత్నించారు. దీంతో ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా భావించిన పోలీసులు విచారణ మొదలెట్టగా మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా చేసిన పనిగా అనుమానించి ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. దీంతో దోపిడీ ముఠాలు జిల్లాను వదిలి తమ స్వస్థలాలకు వెళ్లాయనే అభిప్రాయం కలిగింది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

జిల్లాలో వరుసగా జరుగుతున్న దొంగతనాలను పరిశీలిస్తే తాళం వేసిన ఇళ్లు, షాపులను టార్గెట్‌గా చేసుకుని చోరీలు చేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి నష్టానికి పాల్పడటం లేదు. ఎవరిపైనా భౌతిక దాడులు చేయడం లేదు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించిన పోలీసులకు దొంగలు కారులాంటి వాహనాన్ని ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. బీభత్సం సృష్టించకుండా తాము వచ్చిన పనిని సైలెంట్‌గా చేసుకుంటూ బలమైన ఆధారాలు చిక్కకుండా తప్పించుకున్న తిరుగుతున్న దొంగల భరతం త్వరగా పట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

గతంలోనే హెచ్చరికలు

ఇతర ప్రాంతాలకు చెందిన దోపిడీ దొంగలు జిల్లాకు వచ్చినట్టుగా గతేడాది చివరినాటికే పోలీసు శాఖకు స్పష్టమైన సమాచారం ఉంది. దీంతో రాత్రి వేళలో అనుమానిత, అపరిచిత వ్యక్తుల కదలికల పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ ఆటోలకు మైకులు పెట్టి మరీ ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోనూ ప్రజలను పోలీసు శాఖ అప్రమత్తం చేసింది. దీంతో డిసెంబరు, జనవరిలో దొంగల పన్నాగాలు పెద్దగా పారలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధునాతనంగా నిర్మించినా..



కొత్తగూడెంలో నిర్మించిన జిల్లా గ్రంథాలయ నూతన భవనం

- వినియోగంలోకిరాని గ్రంథాలయ కొత్త భవనం
- షెడ్లు, గ్రీనరీ, ఏసీలు లేకపోవడంతో పాఠకుల విముఖత
- విధిలేక పాత భవనంలోనే లైబ్రరీ కొనసాగిస్తున్న అధికారులు
- రూ.1.50 కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగమే

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించి మూడు నెలలవుతున్నా ఇంకా వినియోగంలోకి రాలేదు. కొత్త భవనంలోకి వెళ్లబోమని పాఠకులు చెబుతుండటంతో పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో దశాబ్దాల కాలం నుంచి జిల్లా గ్రంథాలయం కొనసాగుతోంది. ఇక్కడికి జిల్లా కేంద్రంతోపాటు టేకులపల్లి, పాల్వంచ, జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల నుంచి పాఠకులు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో న్యూస్ పేపర్లు, పోటీ పరీక్షల పుస్తకాలను చదువుకుంటారు. ఇక ఉద్యోగ నోటిఫికేషన్ల సమయంలో పాఠకుల సంఖ్య పెరుగుతుంది. ఈ నేపథ్యంలో పాఠకుల సౌకర్యం కోసం ఇటీవల బీఆర్‌ఎస్ కార్యాలయం భవనం పక్కన రూ.1.50 కోట్లతో గ్రంథాలయానికి అధునాతన హంగులతో భవనం నిర్మించారు. గతేడాది నవంబర్ నెలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నూతన భవనంలోకి పుస్తకాలను తరలిస్తారని అందరూ భావించారు. కానీ పాఠకులు కొత్త భవనంలోకి వెళ్లబోమని తేల్చి చెప్పడంతో గ్రంథాలయ నిర్వాహకులు కూడా చేసేది ఏమి లేక పాత భవనంలోనే జిల్లా గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు.

సౌకర్యాలకు ప్రతిపాదనలు

గ్రంథాలయ కొత్త భవనంలో ఏసీలు, ముందు ప్రాంగణంలో షెడ్లు, మొక్కలు, చెట్లు, గ్రీనరీ లేవు. దీంతో అక్కడికి వెళ్లేందుకు పాఠకులు విముఖత చూపుతున్నారు. రానున్న వేసవి కాలంలో, అందులోనూ కొత్తగూడెంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నూతన భవనంలో ఏసీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉదయం, సాయంత్ర వేళల్లో పాఠకులు చెట్ల కింద కూర్చుని చదువుకునేందుకు ఆసక్తి చూపుతారు. నూతన భవనం దగ్గర అసలు చెట్లే లేకపోవడంతో అక్కడికి వెళ్లేందుకు పాఠకులు ఇష్టపడటంలేదు. దీంతోపాటు భవనం ముందు భాగంలో ఆహ్లాదం కోసం గ్రీనరీ కూడా ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు. దీంతో గ్రంథాలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రతిపాదనలు సమర్పించాక ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఏసీలు, గ్రీనరీ వంటి ఏర్పాటు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది. లేకపోతే పోస్టాఫీసు సెంటర్‌లోని పాత భవనంలోనే గ్రంథాలయం కొనసాగించాల్సి వస్తుంది. ప్రస్తుతం గ్రంథాలయానికి ఉదయం, సాయంత్ర వేళల్లో రోజూ 150 మంది వరకు పాఠకులు వస్తున్నారు. నోటిఫికేషన్ల సమయంలో వీరి సంఖ్య 400కు చేరే అవకాశం ఉంది. ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చే సమయంలోగా నూతన భవనంలో సౌకర్యాలు కల్పిస్తే పాఠకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. నూతన గ్రంథాలయ భవనం వినియోగంలోకి తీసుకొచ్చే విషయమై జిల్లా గ్రంథాలయ సెక్రటరీని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. వారు స్పందించలేదు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- వారసత్వంగా వచ్చిన భూమిని సోదరుడి కుమారుడు ఆక్రమించాడని, విచారణ జరిపి తనకు ఇప్పించాలని దమ్మపేట మండలం బాలరాజుగూడెం గ్రామానికి చెందిన శ్రీరాముల బుచ్చిబ్రహ్మం ఫిర్యాదు చేశాడు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ దమ్మపేట తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- అనారోగ్యం ప్రజాపాలన గ్రామసభకు హాజరు కాలేదని, దీని వల్ల ఉచిత్ విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కోల్పోయానని, తనకు ఆరు గ్యారంటీల పథకం వర్తించేలా చూడాలని కొత్తగూడెం మున్సిపాలిటీ చిట్టిరామవరానికి చెందిన బానోత్ రాములు కోరగా.. చర్యల నిమిత్తం విద్యుత్ శాఖాధికారులకు ఎండార్స్ చేశారు.
- అక్షర టౌన్‌షిప్ కొత్తగూడెం బ్రాంచిలో తాను డిపాజిట్ చేసిన సొమ్మును ఇప్పించాలని కొత్తగూడేనికి చెందిన ఆకుల నాగేశ్వరరావు ఫిర్యాదు చేయగా, దరఖాస్తును ఎస్పీకి ఎండార్స్ చేశారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన విద్యార్థులు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నెలవారీ భత్యం రూ.5 వేలతోపాటు మరో రూ.6 వేలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ కాలవ్యవధి 12 నెలలని, 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి, కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండనివారు అర్హులని వివరించారు. 10, 12, తరగతులు, ఐటీఐ పాలిటెక్నిక్, డిప్లమా, డిగ్రీ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు https://pminternship.mca.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12 నుంచి మార్చి 11 వరకు దరఖాస్తు గడువని పేర్కొన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1800116090కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

టేకులపల్లిలో మిర్చి కొనుగోళ్లు

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డులో సోమవారం మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి జాల నరేందర్, ఇల్లెందు మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి వి.సుచిత్ర మాట్లాడుతూ టేకులపల్లి మండలంలో మిర్చి పంటకు ఆదరణ ఉందన్నారు. ఇక్కడి రైతులు ఖమ్మం, మహబూబాబాద్ తదితర పట్టణాలకు తీసుకెళ్లి మిర్చి విక్రయిస్తే సుమారు రూ.3 వేల వరకు ఖర్చవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో మిర్చి రైతులకు ఇబ్బందులు లేకుండా టేకులపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. తొలిరోజు క్వింటాల్‌కు జెండా పాట రూ.13,300గా నమోదైంది. అత్యల్పంగా రూ.12,100, మోడల్ రేటు రూ.12,500, తాలు మిర్చి ధర రూ. 6500గా నమోదయ్యాయి. తొలిరోజు 145 బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. అనంతరం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధికారులు నరేష్‌కుమార్, వి.శ్రీనివాస్‌రావు, జి.రంజిత్, సీహెచ్ లక్ష్మయ్య, కార్తీక్, మునీర్, శ్రీనివాస్‌రావు, మోహన్‌రావు, హరికృష్ణ, మధు, విజయ, లక్ష్మి, ట్రేడర్లు పాల్గొన్నారు.



జెండా పాట నిర్వహిస్తున్న వ్యాపారులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలి

పాల్వంచ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్ రెడ్డి కోరారు. సోమవారం పాల్వంచలో ప్రచారం నిర్వహించారు. బ్రోచర్లను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవదానం మాట్లాడుతూ నీతి నిజాయితీతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న గోపాల్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనం.. కళావిహీనం

- అస్తవ్యస్తంగా పల్లె ప్రకృతి వనాలు
- నిధుల్లేక భారంగా మారిన నిర్వహణ
- కొరవడిన పంచాయతీ అధికారుల పర్యవేక్షణ



చర్ల మండలం కుదునూరు పల్లె ప్రకృతి వనంలో వాలీబాల్ ఆడుతున్న యువకులు

చుంచుపల్లి: పల్లె ప్రకృతివనాలు కళావిహీనంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ, నీటి సౌకర్యం కొరవడటంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీలు పట్టించుకోకపోవటంతో కొన్నిచోట్ల బోర్డులు మాత్రమే మిగిలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, పచ్చదనాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ఈ వనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో 1,280 పల్లె ప్రకృతి వనాలను ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో వనాన్ని 10 కుంటల నుంచి అర ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసి, 1,500 నుంచి 2,000 వరకు మొక్కలు నాటారు. మేజర్ పంచాయతీల్లో బృహత్ ప్రకృతి వనాలు అందుబాటులోకి తెచ్చారు. అధికారులు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు ఆరంభంలో చూపిన శ్రద్ధ ఆ తర్వాత చూపడంలేదు. కొన్నిచోట్ల వనాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. మరికొన్నిచోట్ల మొక్కలు ఎదుగూబొదుగు లేకుండా పోయాయి. నీరు లేకపోవడంతో మొక్కలు పెరగడం లేదు. పంచాయతీ సిబ్బంది ట్యాంకుల ద్వారా సక్రమంగా నీరందించడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే చాలా వరకు మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. రానున్న వేసవిలో నీటి వసతి కల్పించకపోతే పల్లె ప్రకృతి వనాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది.

కొత్త మొక్కలు నాటడంలేదు..

చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి కొత్త మొక్కలు నాటడంలేదు. దీంతో చాలా చోట్ల మొక్కలు లేకుండానే వనాలు కనిపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాలు చేశాక రెండేళ్ల వరకు ప్రభుత్వం మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేసింది. ఆ కాలం కూడా పూర్తవటం, ఏడాదిగా పంచాయతీల్లో పాలక వర్గాలు లేకపోవటంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధుల్లేక నిర్వహణ కూడా భారంగా మారింది. వీటిల్లోకి పల్లె జనాలు ప్రవేశించి సేద తీరే అవకాశం లేకుండా పోయింది. ఉదాహరణకు చర్ల మండలం కుదునూరు పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తే.. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం, నిర్వహణ భారంగా మారడంతో వనంలోని మొక్కలు మొత్తం చచ్చిపోయాయి. దీంతో స్థానిక యువకులు కోర్టు తయారు చేసుకుని వాలీబాల్ ఆడుకుంటున్నారు. అనేకచోట్ల వనాల పరిస్థితి ఇలాగే ఉంది. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొనైనా మొక్కలకు నీరందించి పల్లె ప్రకృతి వనాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



చుంచుపల్లి మండలం 4 ఇంక్లైన్‌లో అలంకారప్రాయంగా మారిన పల్లె ప్రకృతి వనం

దృష్టి సారిస్తాం



పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కొంత అధ్వానంగా ఉన్న విషయం వాస్తవమే. గ్రామ పంచాయతీలకు వీటి నిర్వహణ భారంగా మారింది. అయినా కొంతవరకు కార్యదర్శులు, సిబ్బంది మెయింటెనెన్స్ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో దృష్టి సారించి గ్రామపంచాయతీ కార్యదర్శులకు కూడా ఆదేశాలు జారీ చేస్తాం.

–వి.చంద్రమౌళి, డీపీఓ

ఉపవాసంతో ఆకలి విలువ తెలుస్తుంది..



మాట్లాడుతున్న జేఐహెచ్ కేంద్ర కమిటీ సభ్యుడు మౌలానా హమీద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపవాసాల ద్వారా ఆకలి విలువ తెలుసుకుని పేదవారిని ఆదుకునే గుణం అలవడుతుందని జేఐహెచ్ కేంద్ర కమిటీ సభ్యుడు మౌలానా హమీద్ మహ్మద్‌ఖాన్, ముఫ్తీ మౌలానా ఇస్మాయిల్ అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ రుద్రంపూర్, రామవరం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రామవరంలోని జమా మసీద్‌లో ఇస్తేఖ్‌బాల్–ఏ–రంజాన్(రంజాన్ మాసానికి స్వాగతం) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం పెంచి, మానవులందరూ కలిసిమెలిసి జీవించేలా అల్లా దీవించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఫారూఖ్ యజ్దాని, షేక్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ సత్తార్, బాబా, అరీఫ్, హఫజుద్దీన్, ఖమర్, జాకీర్, ఆలం, షమీం, పర్వీన్, నస్రా పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీయూసీఐ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డి


యాకూబ్‌షావలి

సింగరేణి(కొత్తగూడెం): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శిగా షేక్ యాకూబ్ షావలిని సోమవారం ఎన్నుకున్నారు. వారితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులు, మరో 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబోయిన సతీశ్ వెల్లడించారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఉర్దుఘర్‌లో జరిగిన సంఘం తొలి మహాసభలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన వివరించారు.

సంత్ సేవాలాల్ జయంతి


మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. 1739 ఫిబ్రవరి 15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతంలో సేవాలాల్ మహరాజ్ జన్మించారని, జగదాంబదేవి ఆశీస్సులతో అనేక తండాల్లో పర్యటిస్తూ బంజారా జాతిని జాగృతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో లావుడ్యా ప్రసాద్, దేవిలాల్‌నాయక్, ధరావత్ నాగరాజు, గుగులోత్ బాలు, భోజ్యా, రాజేశ్‌నాయక్, రమేశ్‌నాయక్, ఎస్‌కే సాబీర్‌పాషా, నాగా సీతారాములు, కోనేరు చిన్ని, జేబీ శౌరి, మండే వీరహనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు పాటుపడాలి

మణుగూరు రూరల్ : క్షయవ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఏసీఎస్‌ఎం కోఆర్డి నేటర్లు సురేష్, సోమయ్య తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భద్రయ్య అధ్యక్షతన సోమవారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడడం, మెడ చుట్టూ, సంకలో గడ్డలు వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మందులు, వైద్యుల సూచనలు పాటిస్తే వ్యాధిని నివా రించవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల్యా, వాల్యా, భాస్కర్‌రావు, తిరుపతి, సతీష్, అశోక్, సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం

భద్రాచలంటౌన్: పట్టణంలోని రామాలయం సమీపంలోని సుమారు 6.98 ఎకరాల ప్రభుత్వ ఆక్రమిత భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. క్రామ రామలక్ష్మమ్మ ట్రస్ట్ పేరులో ఆక్రమించిన ప్రభుత్వ భూమిగా అధికారులు కోర్టును ఆశ్రయించి పదేళ్ల కిందటే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కోర్టులో కేసు వేయగా ప్రభుత్వ భూమిగా పరిగణించి స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు వచ్చిన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. రెండు రోజుల పాటు పంచనామ నిర్వహించి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసిన్నట్లు ఆయన వివరించారు.


రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ములకలపల్లి: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా యటపాక గ్రామానికి చెందిన మర్మం సునీల్, భార్య శైలజ, రెండేళ్ల వయసున్న కుమారుడు కలిసి ఈ నెల 5వ తేదీన ద్విచక్రవాహనంపై ములకలపల్లి మండలంలోని గుట్టగూడెం గ్రామంలో నివసిస్తున్న అత్త ఇంటికి వెళ్తున్న ఈ క్రమంలో పాల్వంచ వైపు నుంచి ములకలపల్లికి వస్తున్న లారీ, మాధారం గ్రామ శివారులో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సునీల్‌తో పాటు శైలజ, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం సునీల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ప్రమాదంలో..

ఇల్లెందు: మండలంలోని ఆంజనేయపురానికి చెందిన భూక్యా హనుమను ఈ నెల 15న పల్సర్ బైక్ ఢీ కొట్టింది. హనుమ తీవ్రంగా గాయపడ్డారు. కుమారుడు తిరుపతి సోమవారం ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ నాగుల్‌మీరాపతాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

కార్గోతో కాసులు



టీజీఎస్ ఆర్టీసీకి ఖమ్మం రీజియన్‌లో కార్గో కాసుల పంట పండిస్తోంది. వినియోగదారులకు సైతం విస్తృత సేవలందిస్తూ ఆదరణ చూరగొంటోంది. కొరియర్ సేవలు ప్రారంభించిన 58 నెలల్లో రూ.కోట్లు ఆర్జించింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 3,29,743 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.6,49,30,640 ఆదాయం లభించింది. ఈ క్రమంలో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి నగరాలకు పరిమితమైన హోం డెలివరీ సౌకర్యాన్ని త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.6.49 కోట్ల ఆదాయం

- కార్గోకు నానాటికీ పెరుగుతున్న ఆదరణ
- జిల్లా నుంచి హైదరాబాద్‌కు హోం డెలివరీ సౌకర్యం
- త్వరలోనే ఉమ్మడి జిల్లాలో అమలుకు కార్యాచరణ


ఖమ్మం కొత్త బస్టాండ్‌లో కొరియర్ బుక్ చేస్తున్న సిబ్బంది

2024, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కార్గోకు వచ్చిన ఆదాయం వివరాలు (రూ.లలో)

నెల	పార్శిల్స్	ఆదాయం
ఏప్రిల్	29,244	57,04,840
మే	35,199	68,46,890
జూన్	30,458	60,61,210
జూలై	29,384	56,12,285
ఆగస్ట్	30,358	58,01,695
సెప్టెంబర్	27,809	53,90,575
అక్టోబర్	31,650	61,64,170
నవంబర్	32,896	66,24,995
డిసెంబర్	33,588	68,97,835
జనవరి	32,287	64,94,285
ఫిబ్రవరి (ఇప్పటివరకు)	16,870	33,31,860

కొరియర్ సర్వీస్‌కు బ్రాండ్..

2020 జూన్ 19న కార్గో సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి పార్శిళ్లను గమ్యస్థానాలకు చేర్చడంలో వినియోగదారుల నమ్మకాన్ని సంస్థ చూరగొంది. దీంతో ఇక్కడ సేవలు పొందే వారి సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తోంది. చిన్న కవర్ల నుంచి పెద్ద పార్శిళ్లు, కంప్యూటర్లు, వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రి ఏదైనా కార్గోలో సురక్షితంగా, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుతోంది. దీంతో అందరూ ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ కొరియర్ సర్వీసుల చిరునామాలకు ఇబ్బంది పడాల్సి రావడం, కొన్ని వస్తువులను వారు అంగీకరించకపోవడంతో అందరూ కార్గో బాట పట్టారు. ఈ సేవలు ఆర్టీసీ బస్టాండ్లలో లభిస్తుండటంతో అడ్రస్ కోసం వెదుక్కోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎవరికైనా పార్శిల్ పంపించాలంటే మొదట గుర్తొచ్చేది కార్గోనే అనేలా కొరియర్ సర్వీస్‌కు బ్రాండ్‌గా మారింది.

ఏడాదిలో రూ.6.49 కోట్లు..

టీజీఎస్ ఆర్టీసీకి కార్గో ఆదాయ వనరుగా మారింది. ఈ సేవలను ప్రారంభించిన తొలి ఏడాదిలో రూ.1.71 కోట్లు రాగా.. ఆ తర్వాత ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతూ వస్తోంది. 2023 –24లో రూ.7.24 కోట్లు వచ్చింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 3,29,743 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.6,49,30,640 ఆదాయం వచ్చింది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, మణుగూరు, మధిర, ఇల్లెందు డిపోల నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి ఇక్కడికి పార్శిళ్లు వస్తుంటాయి. అయితే ఆదాయం పెరగడంలో కార్గో సిబ్బందితో పాటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఎంతో ఉంది. అత్యధికంగా మేలో జిల్లాలో 35,199 పార్శిళ్ల బుకింగ్ ద్వారా రూ.68,46,890 వచ్చాయి. అలాగే డిసెంబర్‌లో 33,588 పార్శిళ్ల ద్వారా రూ.68,97,835 ఆదాయం లభించింది. అలాగే ఇతర ప్రాంతాలకు 1,740 పార్శిళ్లు హోం డెలివరీ ద్వారా కార్గో రూ.4,84,050 ఆదాయం పొందింది.

కచ్చితమైన సేవలు..

ఆర్టీసీ కొరియర్ సర్వీస్ ద్వారా వస్తువులను పంపించడం సులువుగా మారింది. పార్శిల్ ఇవ్వగానే ఆర్టీసీ బస్ ద్వారా పంపుతుండగా వేగంగా గమ్యస్థానాలకు చేరుతున్నాయి. బుక్ చేసిన వెంటనే, డెలివరీ అయిన తర్వాత సెల్‌కు మెసేజ్ వస్తుండడంతో ఎలాంటి భయం లేకుండా పోతోంది. ఖరీదైన వస్తువులను కూడా కార్గో ద్వారా పంపించేందుకు ఎవరూ వెనుకాడడం లేదు. ఆర్టీసీ సంస్థ సైతం వినియోగదారులకు జవాబుదారీగా వ్యవహరిస్తూ ఎలాంటి రిమార్క్ లేకుండా సేవలందిస్తోంది.

త్వరలో ఇక్కడా హోం డెలివరీ..



వినియోగదారులకు మంచి సేవలు అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో మాత్రమే హోం డెలివరీ సౌకర్యం ఉండగా త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ అవకాశాన్ని కల్పిస్తాం. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. హోం డెలివరీ సౌకర్యంతో వినియోగదారులకు మరింతగా సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– వి.రామారావు, మేనేజర్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం లాజిస్టిక్స్

జ్యూయలరీ దుకాణంలో చోరీకి యత్నం..

అద్దెకున్న వాళ్లు లేవడంతో ప్రయత్నం విఫలం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఝాన్సీ జ్యూయలరీ దుకాణంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఓ దొంగల మూఠా బొలేరో వాహనంలో లక్ష్మీనగరం గ్రామంలోని ఝాన్సీ జ్యూయలరీ దుకాణంలో దొంగతనానికి ప్రయత్నించింది. దుకాణం షెట్టర్ తొలగించి లోపలి కౌంటర్‌ను తోయగా ఆ శబ్దం విన్న వెనుక అద్దెకు ఉండే వారు నిద్ర లేచి బయటకు రావడంతో వారు పరారయ్యారు. సమాచారం అందుకున్న సీఐ అశోక్, ఎస్‌ఐలు వెంకటప్పయ్య, గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు. జ్యూయలరీ దుకాణంలో ఏమీ చోరీకి గురికాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పక్కా స్కెచ్..

దొంగలు లక్ష్మీనగరం గ్రామంలోని జ్యూయలరీ దుకాణంలో చోరీ చేసేందుకు పక్కా ప్రణాళికతో వచ్చినట్లు సీసీ కెమెరాల ఆధారంగా తెలుస్తోంది. భద్రాచలం వైపు నుంచి బొలేరో వాహనం చర్ల వైపు వెళ్తూ యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చి ఓ స్వీట్ షాప్ దగ్గర నిలిపి, అక్కడి నుంచి దొంగలు ఝాన్సీ జ్యూయలరీ దుకాణం వద్దకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో కనిపిస్తోంది. వాహనంలో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి జ్యూయలరీ దుకాణం వద్దకు వెళ్లగా వాహనం రివర్స్‌లో దుకాణం వద్దకు వెళ్లింది. షట్టర్ తొలగించి కౌంటర్‌ను తోయడం.. వెనుక ఉన్న వాళ్లు లేవడం.. దొంగలు పరారుకావడం కూడా నిఘా నేత్రాల్లో నిక్షిప్తమైంది. అనంతరం వారు వెళ్తూ కూడా టార్చిలైట్ వేసి దుకాణాలను పరిశీలించి వెళ్లారు. తొలుత అర్ధరాత్రి 2.01 గంటలకు సాయితిరుమల ఇంజనీరింగ్ వర్క్స్ దుకాణం వద్దకు వెళ్లారు. మరోసారి 3.28 గంటలకు సమయంలో మరోసారి ఆ దుకాణం వద్దకు వెళ్లగా లోపల నిద్రిస్తున్న వ్యక్తులు లేవగా హిందీలో తాగునీరు కావాలని అడిగినట్లు తెలిసింది.


దుండగులు తొలగించిన జ్యూయలరీ దుకాణం షట్టర్


దొంగతనానికి వచ్చిన వారు ఉపయోగించిన వాహనం

జ్యూయలరీ దుకాణంలో చోరీ

చర్ల: మండల కేంద్రంలోని జ్యూయలరీ దుకాణంలో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి మెయిన్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీ నర్సింహ జ్యూయలరీ దుకాణం తాళాలు పగులగొట్టేందుకు యత్నించగా.. అవి పగలకపోవడంతో అక్కడి నుంచి భద్రాద్రిరామా జ్యూయలరీ దుకాణం వద్దకు వచ్చారు. తాళాలు పగలగొట్టి 3 కిలోల వెండి వస్తువులు, చిన్న బంగారు వస్తువులు, రూ.15 వేల నగదు, వెయిట్ మిషిన్లను చోరీ చేశారు. మొత్తం సొత్తు విలువ రూ.1.95 లక్షలు ఉంటుందని యజమాని పందిళ్లపల్లి శంకరాచారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వి.కేశవ్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐతోపాటు క్లూస్ టీం చేరుకుని వివరాలను సేకరించింది.


చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కేశవ్

ద్విచక్రవాహనం చోరీ

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాకు చెందిన ఈ.రమేశ్ ద్విచక్రవాహనం చోరీకి గురికాగా.. సోమవారం రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి రమేశ్ గ్రామ సెంటర్‌లో ఉన్న సెలూన్‌లో హెయిర్ కటింగ్ చేయించుకుని బయటకు రాగా.. ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని జగన్నాథపురం శివారు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీజ్ చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

చంద్రుగొండ: మండలంలోని బాలికుంట గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లతో కలకలం రేకెత్తించింది. వివరాలిలా ఉన్నాయి.. బాలికుంట పాఠశాలకు సోమవారం ఉదయం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుడు రవికుమార్ హాజరయ్యారు. పాఠశాల భవనం వరండాలో పసుపు, కుంకుమతోపాటు నిమ్మకాయ, ఎండుమిర్చి, ముగ్గు వేసి ఉండటంతో విద్యార్థులు ఉలిక్కిపడ్డారు. గ్రామస్తులు పాఠశాలకు చేరుకోగా.. హెచ్‌ఎం రవికుమార్ వాటిని శుభ్రం చేయించి పాఠశాల ప్రారంభించారు. సమాచారం అందుకున్న ఎంఈఓ సత్యనారాయణ, పోలీసులు పాఠశాలను సందర్శించారు. ఒకరోజు ముందు ఆదివారం కావడంతో ఎవరో ఆకతాయిలు ఇలా చేసి ఉంటారని ఎంఈఓ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: బయ్యారం మండలం కంభాలపల్లికి చెందిన కోరం రాములు తన కుమార్తె మమతను కొత్తగూడెం మండలం మైలారం నుంచి ఇంటికి తీసుకుని వస్తుండగా ఇల్లెందు బస్టాండ్‌లో పండ్లు కొనుక్కొని వస్తానని చెప్పి వెళ్లి కనిపించకుండా పోయింది. కోరం రాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గల్లంతైన వ్యక్తి విగతజీవిగా..


మల్లేశ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకిన ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. వివరాలివీ.. కొత్తగూడెం పట్టణానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు వేముల మల్లేశ్ (68) ఇంట్లో గొడవపడి ఆదివారం ఉదయం భద్రాచలం వచ్చి గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. అదే రోజు మృతదేహం దొరక్క పోవడంతో సోమవారం గజ ఈతగాళ్లు, పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం దొరకడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి మృతి

చుంచుపల్లి: మండలంలోని చుంచుపల్లితండాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బాదావత్ మనోజ్‌కుమార్ (15) పురుగులమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మనోజ్‌కుమార్ ఓ బాలికతో ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు మనోజ్‌ను మందలించటంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు తొలుత కొత్తగూడెం.. అక్కడి నుంచి ఖమ్మం.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మనోజ్‌కుమార్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చుంచుపల్లి ఎస్‌ఐ రవికుమార్ సోమవారం కేసు నమోదు చేశారు.

రేగుబల్లిలో చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన సులేమాన్ ఇంట్లో జరిగిన చోరీపై ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేశారు. సులేమాన్ సీతారాంపురంలో చిరు హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చే సరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువా తెరిచి పరిశీలించగా నగదు రూ.47 వేలు, 11.5 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

గిరిజనుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్


దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ, అధికారులు

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో ఇచ్చే ఫిర్యాదులను అర్హత మేరకు సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకొని సంబంధిత యూనిట్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఐటీడీఏకు వచ్చే గిరిజనుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం సింగరేణి మండలానికి చెందిన బాలు తమ గ్రామానికి కరెంట్ కనెక్షన్ ఇప్పించాలని, ములకలపల్లి మండలం చింతపేట రైతులకు బోర్లు, కరెంటు మోటార్లు ఇప్పించాలని, అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని ఆ గ్రామస్తులు వినతిపత్రాలు సమర్పించారు. ఇంకా గుండాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన వెంకయ్య సోలార్ విద్యుత్‌తో బోర్ కనెక్షన్ ఇవ్వాలని.. ఇలా పలువురు దరఖాస్తులు అందజేయగా సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. దర్బార్‌లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్‌ఓ భాస్కరన్, ఏపీఓ వేణు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, ఎల్‌టీఆర్ డీటీ మనిధర్, మేనేజర్ ఆదినారాయణ, గురుకులం ఏఓ నరేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, హెచ్‌ఈఓ లింగానాయక్, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు పాల్గొన్నారు.

‘అప్మెల్’ చైర్మన్‌గా ఎన్‌వీకే శ్రీనివాస్


ఎన్‌వీకే శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు అనుబంధంగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్(అప్మెల్) చైర్మన్‌గా ఎన్‌వీకే శ్రీనివాస్‌ను నియమిస్తూ యాజమాన్యం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఆపరేషన్స్, పా డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను అకారణంగా సుమారు నాలుగు మాసాలు హోల్డ్‌లో పెట్టిన యాజమాన్యం .. ఆప్మెల్ చైర్మన్‌గా నియమించింది. అప్మెల్ సంస్థ సింగరేణికి అనుబంధంగా విజయవాడ (కొండపల్లి)లో గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది.

కనకగిరి అడవుల్లో జీవ వైవిధ్యం


అరుదైన సరీసృపం


కనకగిరి అడవుల్లో కనిపించిన అరుదైన జాతి పాము

ఖమ్మంవన్‌టౌన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్న కనకగిరి రిజర్వు ఫారెస్ట్ జీవ వైవిధ్యానికి చిరునామాగా మారింది. వన్యప్రాణి నిపుణులు ఆదివారం ఈ అడవిలో 12 గంటల పాటు కాలి నడకన పర్యటించారు. ఈ సందర్భంగా బ్లూ – ఇయర్డ్ కింగ్‌ఫిషర్ (లకుముకిపిట్ట)ను గుర్తించారు. జిల్లాలోని సత్తుపల్లి డివిజన్ తల్లాడ పరిధిలోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో చేపట్టిన ఈ వాక్‌లో వృక్షాలు, జంతువులకు సంబంధించిన వైవిధ్యాన్ని కనుగొన్నారు. 12 మంది వన్యప్రాణి నిపుణులు నాలుగు కిలోమీటర్ల అడవిని అన్వేషించి.. 65 పక్షిజాతులు, 5 క్షీరద జాతులు, 5 చేప జాతులను డాక్యుమెంటరీ రూపంలో రికార్డు చేశారు. ఇక మిగిలిన పక్షులలో బ్లాక్–వింగ్డ్ శ్రైక్, రూఫస్ వడ్రంగిపిట్ట, వైట్–రంప్డ్ మునియా, బ్లూ–థ్రోటెడ్ బ్లూ ఫ్లైక్యాచర్, బ్లాక్–రంప్డ్ షామా ఉన్నాయి. ఇక్కడి ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణుల రకాలు ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైల్డ్ తెలంగాణ నుంచి ప్రదీప్ ప్రాజ్, మీరాకి ఆర్గనైజేషన్ నుంచి నవీన్ బాలా, ఎ.సుజిత్, వి ఊల్ఫ్ ఫౌండేషన్ నుంచి పి.హరికృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతిపెట్టిన మృతదేహానికి శవపరీక్ష


మృతదేహాన్ని వెలికితీయిస్తున్న అధికారులు

పాల్వంచ: పాతిపెట్టిన మృతదేహాన్ని పోలీసులు బయటకు తీయించి శవపరీక్ష నిర్వహించారు. పట్టణ పరిధిలోని పేటచెరువు గ్రామానికి చెందిన పెయింటర్ పప్పుల నరేశ్ (33) ఈ నెల 10వ తేదీన అస్వస్థతకు గురవగా ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. 11న తిరిగి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే, నరేశ్ 10వ తేదీన అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుతో కలిసి మద్యం సేవించాడు. అతను కూడా మరుసటి రోజు నుంచి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరాడు. అనుమానం వచ్చిన తల్లి చుక్కమ్మ మద్యం సేవించడం వల్లే తన కొడుకు మృతి చెంది ఉండవచ్చని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్ వివేక్, ఎస్‌ఐ సుమన్, వైద్యుల సమక్షంలో పాతిపెట్టిన మృతదేహాన్ని సోమవారం బయటకు తీయించి శవపరీక్ష నిర్వహించారు.

పెట్టుబడి పెడితే రెట్టింపవుతుందని టోకరా

- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు
- విచారణ చేపట్టిన పోలీసులు

ఖమ్మంఅర్బన్/కారేపల్లి: దుబాయ్ కేంద్రంగా పని చేసే ఓ ఆన్‌లైన్ సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ చూపారు. మరో ఇద్దరిని చేర్పిస్తే కమీషన్ రూపంలో డబ్బు వస్తుందని ఊదరగొట్టారు. మధ్యలో గోవా, బ్యాంకాక్ లాంటి ప్రదేశాలకు తీసుకెళ్తామని నమ్మబలికారు. తీరా చూస్తే ఉన్న డబ్బు పోయి మోసపోయామని గుర్తించి, చివరికి పోలీసులను ఆశ్రయించారు బాధితులు. కారేపల్లిలో ఓ ల్యాబ్ నిర్వాహకుడు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టగా.. టేకులపల్లికి చెందిన ఉపేందర్, కారేపల్లికి చెందిన రవి కుమార్, రామనర్సయ్యతో పాటు మరో పదిమంది ఖమ్మానికి చెందిన ముగ్గురు వ్యక్తుల ద్వారా డిపాజిట్ చేసి, మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు. కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాంను వివరణ కోరగా.. మెటాఫ్లస్‌కు సంబంధించిన బాధితులు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టామని చెప్పారు. ఇదే రకంగా మోసపోయిన కొందరు బాధితులు నగర ఏసీపీని కలిసి వివరించినట్లు తెలిసింది. ఏసీపీ సూచన మేరకు కొందరు బాధితులు ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా కొందరు ఫిర్యాదు చేయగా విచారణ చేట్టామని, గోవా ట్రిప్‌నకు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం ఉందని, వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు విషయం తెలుస్తుందని వెల్లడించారు.